కథానిక

# మారిన పిలుపులు

ఎన్. నిర్మల

ఇలహాబాద్ యూనివర్శిటీకి నాలుగువేపులా ఉన్న రోడ్డులో "శర్మా కాఫీహోటల్"కు చాలారోజులకు వచ్చిన సుశీల్ కుమార్ "బాయ్! ఒక కప్ కాఫీ" అంటూ దగ్గరలోవున్న బెంచీమీద కూర్చున్నాడు. యూనివర్శిటీలోనున్న విద్యార్థి విద్యార్థినులు విచిత్రములైన తమతమ వేషభూషణములతో సైకిళ్ళు కార్లూ మొదలగు వాహనముల మీదా నడుస్తూనూ నవ్వుతూ పేలుతూ ఈలలు వేసుకుంటూ పోతున్నారు. ఇదంతా చూస్తున్న సుశీల్ కు తనజీవిత సంఘటనలు కొన్ని జ్ఞాపకము రావటం మొదలుపెట్టినవి. సుమారు మూడు సంవత్సరాల క్రితము తనుకూడా ఇక్కడనే చదువుతుండేవాడు. ఇట్లాగే ఎంతో సంతోషముగా వుండేవాడు. అప్పటి ఆ జీవితంలోనూ ఇప్పుడు ఈ జీవితంలోనూ ఎంత మార్పు వుంది. అప్పుడు అతనిలో కొత్తకొత్త ఆశలు నూతనోత్సాహము వుండేవి. స్నేహితులతో కలిసి కొత్త ప్రోగ్రాములు వేస్తూవుంటే కొన్ని పాడయ్యేవి. ఎప్పుడూ,భవిష్యత్తునుగురించిన ఊహలతో తీయని కల్పనలతో ఎన్ని గంటలు గడిచినా తెలిసేదికాదు. నేటి జీవితం యెంత నిరుత్సాహం శుష్కమూగా ఉందోగదా! మిత్రులెవరూ లేరు. ప్రోగ్రాములూ లేవు. భవిష్యత్‌నిగురించిన ఆలోచనలూ లేవు. అన్ని విధాలా నేడు అతను శిథిలావస్థలో నున్నాడు.

అతను యూనివర్శిటీలో కొత్తగా చేరిన రోజుల్లో అతనికి స్నేహితు లెవరూలేరు. ఒంటరి జీవితాన్నే గడిపాడు. తన పుస్తకములతో కాలాన్ని గడిపేవాడు. కాని చాలా రోజులు ఇట్లాగే గడవలేదు. పరీక్షల్లో అందరిలోకి ప్రథముడుగా రావటంవల్ల యూనివర్శిటీలోని విద్యార్థి విద్యార్థినులు అందరూ అతని స్నేహాన్ని వాంఛించారు. అటువంటి వారిలో ఒకతెయైన శీల అతని జీవితంలో అడుగుపెట్టింది.

శీలకు తల్లిలేదు. చాలా ధనవంతులు. ఒక్కతే కుమార్తె కావటంవల్ల దానికంతటికీ ఈమెయే అధికారిణి, యౌవనావస్థలోనున్న సుందరమూర్తి తన ఇష్టప్రకారము స్వేచ్ఛగా చదువుతోంది. ఈ సంవత్సరము బి. ఏ. పితృప్రేమ ధనము నౌకర్లూ షికారు వెళ్ళటానికి కార్లు మొదలుగువాటితో ఆమె జీవితము సుఖస్వప్నాలలో తేలిపోతోంది. రూప గుణములేకాక అపరిమితమైన వాక్చాతుర్యము గలది. చంచల స్వభావురాలు. వ్యవహారకుశలురాలు. ఆమె ఆకర్షణలో పడిన కుమార్ కు ఆమెతో పరిచయము ఆత్మబంధువులతోమాదిరిగా తోచింది. ఆమె స్నేహాన్ని పొంది తనదాన్నిగా చేసుకోవాలనే నిష్ఫల ప్రయత్నము కూడా చేశాడు.

ఈ ఆలోచనలోవున్న సుశీల్ కు బాయ్ తీసుకు వచ్చి అక్కడ పెట్టిన కాఫీకప్ కనపడలేదు. గత సంగతులన్నీ సినిమావలె కనపడసాగినై.

ఒకనాటి సాయంకాలము శీల కోరికననుసరించి శీల ఇంటికి టీ పార్టీకి వెళ్ళాల్సొచ్చింది. కొంచెం పొద్దుపోయేసరికి టీ పార్టీ పూర్తయింది. వచ్చిన అతిథులందరూ ఒకరివెనక ఒకరు నెమ్మదిగా వెళ్ళిపోతున్నారు. పిల్లతెమ్మెరల గాలులతో నిండిన శీల వాళ్ళ బంగళాను వదిలి వెళ్ళాలని సుశీల్ లేవబోతున్నాడు. శీలతండ్రి అతనిదగ్గరకు వచ్చి కూర్చున్నాడు. అప్పుడు అతను ఆయన ఆజ్ఞలనుసరించి కాసేపు కూర్చుని తర్వాత ఇంటికొచ్చాడు. కాని ఆ రాత్రి అతను సుఖనిద్ర చెందలేకపోయాడు.

ఆనాటినుండి ప్రతిరోజూ అతను శీల ఇంటికి వెళ్ళేవాడు. చదువు చెప్పటంకంటె ఆమెను అర్థము చేసుకోటానికి ఎక్కువగా ప్రయత్నించేవాడు. ఏరోజైనా ఒకరోజు వెళ్ళకుండావుంటే ఏదో పోగొట్టుకున్నవాని వల్లే బాధపడుతూ అశాంతిగా వుండేవాడు. చదువేగాక, షికార్లు, సినిమాలనుగురించీ మాట్లాడేవారు. ఇన్నెందుకు సుశీల్ హృదయం శీలను తనదానిగా ఎన్నుకుంది.

రోజూ కలుసుకోవటంవల్ల అతని మనస్సులోని ఆ వృక్షము వృద్ధి చెందింది. అతను శీలను కోరసాగాడు.

శీలకూడా అతన్ని కోరుతున్నప్పటికీ ధన వాతావరణ ప్రభావములవల్ల తన ఊహలలో తనేవుండి సంకుచిత స్వభావంతో వుండేది. తను పెండ్లియాడే పురుషునివద్ద తన తండ్రిదగ్గరకంటె ఎక్కువ ధనము ఉండాలని ఆమె కోరిక. సుశీల్ ధనవంతుడుకాడు. చక్కని బంగళా కారు కావాలని ఆమెఊహ. సుశీల్‌కు అవి స్వప్నంలో కూడా లభ్యముకాని వస్తువులు. ఇందువల్ల సుశీల్ పెండ్లి విషయం అడిగితే శీల "ఇప్పుడే ఏం తొందర. ముందర డబ్బు కావాలిగదూ. అది లేదాయె. తీరా నాన్నగార్ని అడగటమూ బాగుండ" దని జవాబిచ్చింది. కానీ సుశీల్ తనస్థితి అంతా చెప్పి అన్నివిధాలా సుఖపెట్టగలనని చెపుతూ ఎన్నోసార్లు బతిమిలాడాడు. కాని అన్నీ నిష్ప్రయోజనమైనయ్. ఆ ప్రస్తావన వచ్చినపుడల్లా శీల అతనితో మాట్లాడేదే కాదు. ఇందువల్ల అతని హృదయంకంటె ఆత్మగౌరవానికి దెబ్బ తగిలింది. అది అతను సహించలేక పోయాడు. జీవితం సూన్యముగా కనపడింది.

మరుసటి రోజు యూనివర్సిటీలోని పిల్లలందరూ సుశీల్‌కుమార్ ఆకస్మిక అంతర్ధానము గురించి ఆశ్చర్యచకితులైనారు.

ఆనాటినుండి శీలను మరువాలని అటూ ఇటూ తిరుగుతూ చాలా ప్రయత్నించాడు. కాని మరువలేక పోయాడు. వినోదగృహాల్లో గంటల కొలది గడిపి రోడ్డుమీదనైనా రైలుపట్టాలమీద నయినా పడుకునేవాడు. కలలో శీల కనుపించి "సుశీల్ పెండ్లికి డబ్బుకావాలి. అది నీదగ్గర లేదు" అనేది. వెంటనే మెలుకువ వచ్చి లేచి జేబులోంచి ఒకసీసాతీసి ఒకచిన్న వుండతీసి వేసుకొని మరల పడుకునేవాడు. కొద్దిసేపటికే లేచి తూలిపోతూ నడచి శీల ఇంటికి వెళ్ళి తలుపు బాదేవాడు. ఆమె కంగారుగా లేచి తలుపుతీసి చూసేసరికి ఎర్రటినేత్రములతో తైలసంపర్కము లేక చెదరియున్న వెంట్రుకలతో చిరిగిన చొక్కాతో వున్న నవయువకుడొకడు నిలబడి యున్నాడు. అతన్ని చూచేసరికి ఇదివరలో ఆమె కున్న కోపము తగ్గిపోయింది. వేశ్యైనప్పటికీ మానవ హృదయాల్లో దాగివున్న సానుభూతి ఆమె హృదయంలో కలుగుతుంది. అతన్ని లోపలికి తీసుకునివెళ్ళి కూర్చోపెట్టి పాటలుపాడి నృత్యముచేసి అతని మనస్సుకు శాంతిని చేకూర్చటానికి ప్రయత్నిస్తుంది. అప్పుడు అతను తాత్కాలిక శాంతిని పొందేవాడు.

ఈవిధముగా సుశీల్ శీలను మరవాలని అక్కడక్కడా తిరిగి నల్లమందుతో కడుపు నింపుతూ అప్పటికి శాంతిలేకపోతే లీలయింటికి వెళ్ళేవాడు. లీలలో శీలనుచూడాలని ప్రయత్నించేవాడు. ఇదే అతని దినచర్య.

అతని ఈ విచిత్ర అలవాట్లను గురించి స్థితిని గురించి లీల ఎప్పుడూ ఆలోచిస్తూ వుండేది. అతనియందు సానుభూతి కనపరచేది. అతను తన దగ్గరగా నున్నప్పుడు ఎంతో సంతోషించేది. తన నడతకూడా మార్చుకొని ఎవరినీ రావద్దని చెప్పి వేసింది. అతనికోసము ఎదురుచూస్తూ అతను రాగానే సంతోషించేది. పగలు రాత్రి అతని తోటే గడుపుతూ వుండేది.

కొద్దిరోజులు గడువగానే సుశీల్ స్థితిలో చిత్రమైన మార్పువచ్చింది. అతని ధనమంతా నెమ్మదిగా పూర్తికాసాగింది. లీలతో వుండటము అనుమానంగా వుండి ఒకరోజు ఆమె నిద్రపోతూండగా వెళ్ళిపోవటము మంచిదనుకొన్నాడు.

కొద్దిరోజుల తర్వాత ఒక పత్రికవల్ల లీల పిలుపు అతనికి తెలిసింది. అతని హృదయం ఆమెను కలుసుకోవాలని వ్యాకులపడింది. ఆమెను చూడటముకోసము వెళ్ళాడు. అతను వచ్చేసరికి ఆమె తన మృతఘడియల్ని లెక్కపెడుతున్నది. ఎముకల గూడుమీద కప్పివున్న చర్మముమాత్రము కనపడుతోంది. మొదటవున్న రూప సంపదకానీ ప్రఫుల్ల వదనంకానీ లేదు. సుశీల్‌ని చూడగానే లీల ఎంతో సంతోషించి తన పక్కన కూర్చొపెట్టుకుంది. పోయిన ధనము దొరికితే మనుష్యుడు ఎంత సంతోషిస్తాడో అంతకంటే వెయ్యిరెట్లు ఆనందముగా వుంది లీల. సుశీల్ లీలకు మందులూ అవీ ఇచ్చి చాలా సేవ చేశాడు. కానీ ఆమె దక్కలేదు, మూడవరోజున చనిపోయింది.

చచ్చిపోవటానికి ముందు ఆమె అతనితో "ప్రియతమా! ఇహ ఎప్పుడూ లీలవంటి స్త్రీల

పంజరములో చిక్కవద్దు. నీ చదువు పూర్తికా లేదు కదూ. మళ్ళీ ప్రారంభించి చదువుకో" అంటూ ఏమేమో చెప్పబోయింది సంతోషంగా కాని ప్రాణాలు దక్కలేదు. తన అజ్ఞానాన్ని తెలుసుకొని సుశీల్ ఏడ్చాడు. కాని అతనిని వదిలి ఆమె వెళ్ళిపోయింది.

లీల తన ఆస్తంతా సుశీల్‌కు వ్రాసియిచ్చింది. అప్పటినుండి; సుశీల్ శీలను మరచిపోయాడు. శీలకోసము అతను చాలా విలువను పోగొట్టుకున్నాడు. శీల మోహములో పడి తన ప్రియమైన లీలను బలిచేసుకున్నాడు. అది మొదట తెలుసుకోలేక పోయాడు. తెలుసుకున్నట్లయితే ఎంత బాగుండేది.

కారు హారనుతో అతని ఆలోచనా ప్రవాహము ఆగిపోయింది. ఆ కారు ఆ హోటలు గేటుదగ్గరే ఆగింది. ఆ కారులోంచి దిగిన శీల హోటల్లోకి వచ్చీరాగానే సుశీల్‌ను గుర్తుపట్టి "హలో! సుశీల్‌కుమార్! ఇన్ని రోజులనుంచి ఎక్కడకు వెళ్ళావు? కులాసాగా వున్నావా? చెప్పకుండానే వెళ్ళిపోయావేం? చెప్పు" అంటూ అడిగింది.

"డబ్బు సంపాదిద్దామని వెళ్ళాను శీలా!" అన్నాడు సుశీల్. శీల ఇదివిని పకపకా నవ్వుతూ "నిజంగా నేనా. ఎంత సంపాయించావ్?" అంది. వెంటనే సుశీల్ తన జేబులోంచి మూడున్నర లక్ష రూపాయల బ్యాంక్ చెక్కును బైటకుతీస్తూ "చూడండి, ఏదో ఇంత సంపాయించాను" అన్నాడు. అది చూచిన శీల చకితురాలైంది. వెంటనే ప్రసన్నవదనంతో "ఇహ మన వివాహం జరగటానికి ఏ అభ్యంతరమూ లేదు సుశీల్. నాన్నగారితో ఈ విషయమై ఇప్పుడే మాట్లాడుతాను" అని వుత్సాహంగా అంది.

అన్యమనస్కుడైన సుశీల్‌కుమార్ చిరునవ్వు నవ్వుతూ "చాలావిచారిస్తున్నానండీ శీలాదేవిగారూ. నా పెండ్లి జరిగిపోయింది. ఇహ డబ్బు మిగిలింది. ఇది మీకు తెలియచేయాలనే నేను ఇప్పుడు ఇక్కడకు వచ్చాను. పెండ్లికి డబ్బుతో ఏమాత్రమూ సంబంధములేదు. పెండ్లే స్త్రీపురుషుల పరస్పర సంబంధముయొక్క పవిత్ర సూత్రము. ఈ సంబంధము వల్ల బంధింపబడిన వారికి బలము చేకూరుతుంది. ప్రపంచ కార్యములలో పాల్గొనుటకు అప్పుడువారు సమర్థులు కాగలరు. పరస్పర దాంపత్యప్రేమ ఆ సఫలత్వానికి పునాది అవుతుంది. ఇందువల్ల వారి జీవితంకూడా సఫలమౌతుంది. వివాహమాడాలనే కోరిక కథనాన్ని అనుసరించి ఎప్పటికీ వుండదండీ శీలాదేవిగారూ! నీన్ని ఎవరైనా ఒప్పుకున్నట్లైతే వేశ్యవృత్తిని ఒప్పుకున్నట్లే. చెప్పటమూ బాగుండేదేమో! నేను చెప్పింది బాగా వుందా లేదా అండి" అన్నాడు.

సుశీల్‌కుమార్ చెపుతున్న అసందర్భపు మాటలనువింటూ అతని ముఖంచూస్తూ వూరుకుంది శీల. జవాబు చెప్పేందుకు ఏ ఆలోచనా తోచక ఆ చల్లారిపోయిన టీ కప్ తీసుకొని గడగడా తాగేసింది.

(ఆధారం: హిందీ కథ.)

---

"స్టేటస్టిక్స్ ప్రకారం నూటికి ముప్ఫయిమంది స్త్రీలకంటె పురుషులే పిచ్చాసుపత్రులలో ఎక్కువ" అని ఒక స్త్రీ ప్రొఫెసరు చెప్తోంది. వెనుక బెంచీలోని ఓ చిన్న యువకుడు హఠాత్తుగా లేచి అరిచాడు: "సరే ఒప్పుకుంటాంకాని, వాళ్లని అక్కడికెవరు పంపారో తెలుసా?"

* * *

భార్యాభర్తలు తీక్షణంగా దెబ్బలాడుకుంటున్నారు.

"నిన్ను నేను పెండ్లిచేసుకున్నప్పుడు ఒక్క గుడ్డపీలికైనా లేదు నీకు" అన్నాడు భర్త లోకువగా.

"అవునవును... యిప్పుడు కావలసినన్ని వున్నయ్" అంది భార్య ఎత్తిపొడుపుగా.